
కథ

# పాత తోవకు కొత్త గమ్యం

సింహమూర్తి



హవ్వ !, మహా శివరాత్రి వెళ్లిన మర్నాడు గొడ్డు అమావాస్య రోజున, అదీ వర్జ్య కాలంలో, మంగళవారం రాత్రి ఏడూ - ఏడూ నిముషాలకు, అదీ సరిగ్గా ఏడవ తారీఖున బ్రహ్మశ్రీ, పంచాంగ పరబ్రహ్మ, జాతకచక్రలాటి అనేక బిరుదులు పొందిన రామాంజనేయ శాస్త్రి తన కుమార్తె వివాహం జరిపించడమా?

అన్నీ తెలిసిన వాడే పుణ్యప్రదమైన పంచాగాన్ని భ్రష్టు పట్టించాడు- ఎంత ఘోరం!

ఎక్కడ విన్నా ఇదే గొడవ!

పది ఊళ్ళకి పెద్ద మనిషిగా పేరున్న సుందరయ్య చౌదరి పంచె బిగించి చిర్రెత్తి పోతూ, "పంతులూ! మా అమ్మాయి పెళ్లికి ముహూర్తం పెట్టవయ్యా అంటే మూఢ మన్నావు, రాహు వన్నావు - ఆ నెలలో అంతా క్షీణ మన్నావు. పెళ్లయిన మూడు రోజుల్లోగా వధువు కాని, వరుడు కాని కాలం చేస్తా రన్నావు - అలా జరక్కపోతే జందెం తెంచి పారేసి, నీ సకల పంచాంగ జ్యోతిశ్శాస్త్రాలూ నడి రోడ్డు మీదికి విసిరి కిరసనాయిలు పోసి తగలేస్తా నన్నావు. ఇదేమిటిలా మీ అమ్మాయి కీ ముహూర్తంలో పెళ్లి చేశావు?" అని తెగేసి అడిగాడు.

అవన్నీ నిజమే - కాని వృత్తి రీత్యా అవన్నీ తాను చెప్పడం భావ్యం అని చెప్పాడు. కాని నమ్మే వాళ్లకే అవన్నీ కాని, అ వేమీ అక్కర్లేని వాళ్లకి పంచాంగంతో ప నేముంది?

"ఏమీ తెలియని చెప్పులు కుట్టుకునే వాడిక్కూడా తెలును - ఈ నెలలో ముహూర్తా ల్లేవని - కాని అందరికీ ముహూర్తాలు చెప్పే పంతులు గారే తమ కూతురికి గొడ్డు అమావాస్య రోజున పెళ్లి చేశాడయ్యా!" అంటూ వెటకారంగా నవ్వేడు రెవెన్యూ ఆఫీసులో పని చేసే లిటిగేషన్ కుటుంబరావు.

చుట్టు ఉన్న వాళ్లంత గొల్లున నవ్వి "ఇతరులకైతే మూఢమూ, వర్జ్యమూను. తన కూతురుకైతే అది శుభ ముహూర్తం. ఇ దేం పంఛాగ మండీ - చుట్టు పట్ల పంచాంగం చూసే చిన్న చిన్న పంచాంగ కర్తలు 'ఛీ' అంటున్నారు" అన్నాడు వైష్ణవుడైన నరసింహాచార్యులు.

తల నెరసిన పండిత పామురులంతా ఇదేంటో తెలునుకుందామని రామాంజనేయ శాస్త్రి ఇంటి కెళ్ళి కూర్చున్నారు అరుగు మీద ఆ వేళ.

షామియానాలూ వగైరా తీసేసినా ఇంటికి పెళ్లి కళా, ఇంటి చుట్టూ పెళ్లి వాసనా పోలేదు.

"వారు ఇంట్లో లే రండీ" అంది రామాంజనేయ శాస్త్రి భార్య అందరు పెద్దల్నీ ఉద్దేశించి.

అంతా నానా విమర్శలూ చేసుకుంటూ, నానా తిట్లు తిట్టుకుంటూ తిరుగుముఖం పట్టారు.

అప్పుడే బస్సు దిగాడు రామాంజనేయ శాస్త్రి. ఊర్లోకి రాబోతున్న శాస్త్రికి పెద్దలంతా గుంపుగా తన కెదురై అడ్డగించడంలో గల అంతర్యం కొంత అర్థమయ్యింది.

"పంచాంగ ధర్మం తెలిసి కూడా, అందరికీ మూఢాలూ, వర్జ్యాలూ ధ్రువీకరిస్తూ, సరిగ్గా అదే

**ఊరందరికీ పంచాంగాలు, శాస్త్రాలు తిరగేసి సుముహూర్తాలు నిర్ణయించేవాడు రామాంజనేయశాస్త్రి. మరి తన కూతురికి అమావాస్యనాడు వర్జ్య కాలంలో కూడని ముహూర్తంలో పెళ్లి చేయడంలోని మతలబు-**

సమయంలో, గొడ్డు అమావాస్య రోజున ఎందుకు మీ అమ్మాయికి పెళ్లి ముహూర్తం పెట్టావు. అదే దుర్ముహూర్తంలో నీ కూతురికి వివాహ మెలా జరిపించావ్? పంచాంగాన్నీ జ్యోతిశ్శాస్త్రాన్నీ భ్రష్టు పట్టించి దాని మీద నమ్మకం లేకుండా అపవిత్రం ఎందుకు చేశావు?'' అంటూ అంత రాక్షసుల్లా శాస్త్రి మీద పడ్డారు.

ఛాందస వాదాన్నీ మూఢ నమ్మకాల్నీ అనాచారాల్నీ ఖండించడానికెందరో సంఘ సంస్కర్తలు పుట్టిన దేశం ఇది. తప్పును ఖండిస్తే ఆ వ్యక్తి సంఘ ద్రోహి.

అస్పృశ్యత, సతీ సహగమనం, ఛాందస భావం, మూఢ నమ్మకాలూ, బలులూ, దైవార్పణలూ, దేవదాసీలూ, పిండాలూ ఏమిటి? వీటి నిజ స్వరూపా లెందుకు తెలును?

మారుతున్న లోకంలో మారలేని మనుషులు, మనుషుల పాలిట ఘోర నేరస్థులు - వీళ్ళ నమ్మకాలు ప్రగతికి అవరోధం!

కాని ఏం చెప్పగలడు? చెప్పాలి. ప్రతిఘటించాలి.

వితంతువులకు మళ్లీ పెళ్లి చేసిన వీరేశలింగం పంతు లెన్ని బాధ లనుభవించలేదు! సహనంతో సమాజాన్ని ఎదుర్కోవాలి.

శాస్త్రిలో ఓ నూతన వ్యక్తి వెలిశాడు. అందరి కళ్ళూ శాస్త్రి వైపే.

మిట్ట మధ్యాహ్నం. మండు టెండ. నెత్తి మీద ఉన్న తువాలు కూడా తీసి అవతల పారేశాడు. కాళ్ళ కున్న చెప్పు పక్కకు విసిరాడు.

అప్పటికే బాగా వేడెక్కి కాలుతున్న ఇసుక పుంత మధ్యలో ధ్యానముద్రలోకి వెళ్లబోయే మునీశ్వరుడిలా నిలబడి అందరికీ చేతులు జోడించి నిలబడ్డాడు.

తక్కిన పెద్ద లంత విస్మయంలో పడ్డారు. వాళ్లంతా చెట్టు నీడకి నడిచారు.

''మీరు కూడా కా స్సేపు నాతో ఈ కాలే ఇసుక పుంతలో నిలబడితే, నేను చెప్పబోయే సమాధానం బాగా అర్థ మవుతుంది'' అన్నాడు శాస్త్రి.

ఎవ్వరూ నీడలోంచి శాస్త్రి దగ్గరకి కదలి రాలేదు.

''నీడన నిలిచి ఎ న్నయినా చెప్పవచ్చు. కాని మండే ఈ ఎండలో నిలిచి నాతో కా స్సేపు ఉంటే మీకు నా బాధ అర్థమవుతుంది. అందుకే నీడనున్న మీకు ఎండలో మాడుతున్న నా లాటి వాళ్ల గోడు వినిపించదు.''

''ఇంతకీ నీ ఉద్దేశ్యం?'' అందులో ఒకరు శాస్త్రిని ప్రశ్నించారు.

''నన్ను దోషిగా నిర్ధారించడానికి ప్రయత్నిస్తున్న మీరు, నా బాధ్యత గురించి ఆలోచించక పోవడం విచారకరం. పంచాగాల్ని పట్టుకు కూర్చుంటే. నా కూతురికి పెళ్ళి చేయలేక పోదును'' అన్నాడు శాస్త్రి.

''పంచాంగ శాస్త్రాన్ని నీ కూతురు వివాహానికి సుముఖంగా మలుచుకుని, పంచ మహా పాపాల్నీ అంటగట్టుకుంటా వటయ్యా? ఊ రంత మా ముఖం మీద ఊస్తుంది - అది భరించలేక చస్తున్నాం'' అన్నాడు నరసింహాచార్యులు.

''పంచ భూతాల్ని సృష్టించింది మనం కా నప్పుడు, పంచాగాల్ని సృష్టించి దాని ప్రకారం శుభాశుభాల్ని నిర్ణయించే హక్కు మన కెవ రిచ్చారు?''

''పాపం పాపం!'' అన్నారు అవతల నుంచి.

''సనాతన ఛాందస ధర్మకృతులపై నే నీనాడు చేస్తున్న దండయాత్ర ఇది - కా దనగలరా? కళ్ళు ఎరుపెక్కాయి.

శాస్త్రి! నువ్వి వచ్చే జన్మలో ఆఖరి కులంలో పుడతావు'' అన్నాడు నరసింహాచార్యులు.

''నువ్వు వచ్చే జన్మలో ఏ మయి పుడతావో నీకు తెలుసా? రేపు గురించి చెప్పలేని మానవుడు వచ్చే జన్మ గురించి ఎలా చెప్పగలడు?''

''నువ్వు మితిమీరుతున్నావు శాస్త్రి!''

''ముందు నేను చెప్పేది వినండి!'' అంటూ రెం డడుగులు ముందు కొచ్చాడు శాస్త్రి. ''పంచాంగాల ప్రకారం శుభ ముహూర్తాలు పెట్టి ఎన్నో పెళ్లిళ్లు చేశాం. అందులో ఎన్ని నిలిచాయి? పోయిన నెల బ్రహ్మాండమైన ముహూర్తంలో శాస్త్ర యుక్తంగా జరిపించిన సోమయాజులు కూతురి పెళ్లికి మర్నాడే వరుడు మధు పర్కాల్లోనే యాక్సిడెంట్‌లో పోయాడు. వెంకటపతిరాజు గారి ఇంట్లో మనం జరిపించిన కళ్యాణం వారం తిరిగి రాక ముందే బెడిసి కొట్టి విడాకుల వరకూ వెళ్లింది. సోమి నాయుడు గృహ ప్రవేశానికి గొప్ప ముహూర్తమే పెట్టాం. కాని ఆ మూడో రోజునే ఆ కుటుంబ మంతా ఆ ఇంట్లోనే సమాధి అయ్యారు. ఇలా చెప్పుకుంటూ పోతే పంచాంగానికీ, పరిస్థితులకూ పొత్తు కుదర లేదు. మనిషికి మంచి చేస్తామని మభ్యపెట్టి అతనిలో బలహీనతను మన పొట్టి కూటి కోసం వాడుకోవడం తప్ప ఏ గ్రంథమూ, ఏ మనిషీ రేపటి గురించీ మనిషిలో జరుగనున్న మార్పు గురించీ చెప్ప లేదు - చెప్ప లేడు. అది ఎక్కడా, ఎప్పుడూ తయారు కాలేదు'' అన్నాడు శాస్త్రి.

''మన ఆచార ధర్మాలూ, శాస్త్ర రీతులూ, కుల వ్యవహారాలూ మరచి విచ్చల విడిగా మాట్లాడే ధైర్యం నీ కెవ రిచ్చారు?'' రెచ్చి పోయాడు నరసింహాచార్యులు.

''మనం గొప్పగా చెప్పుకునే మన ప్రాచీన గ్రంథాల్లో అనేకమైన తప్పులున్నట్టు అందరికీ తెలుసు. వాటిని మనం నెత్తిన పెట్టుకుని పూజించాల్సిన అవసరం లేదు. అలాగే కన్యాదానంతోపాటు డబ్బూ, బంగారం వరుని కిచ్చుకోవాలని కూడా ఏ శాస్త్రంలోనూ లేదు. పేదరికంలో మగ్గే నేను నా కూతురికి వివాహం చెయ్యలేక తండ్రిగా నా ధర్మానికీ, కర్తవ్యానికీ వచ్చిన అవరోధం మీరు తీర్చారా? మీరు మీ స్వార్థం కోసం పెట్టుకు పూజించుకుంటున్న ఈ పంచాంగాలూ తీర్చాయా? మీరు చదివిన వేదాంతాలూ, ఉపనిషత్తులూ అందర్నీ సమానంగా చూడమని బోధిస్తే కొందరిని అంటరాని వాళ్లుగా నేటికీ ఎందుకు అసహ్యించుకుంటున్నారు? మీలో ఆ జ్ఞాన సంపదకి అంధత్వం వచ్చిందా?''

ఎవ్వరూ మాట్లాడ లేదు.

''మాట్లాడ రేం? మీ ధర్మాలు పంచాంగాలకూ, జాతకాలకూ, పౌరోహిత్యాలకూ పరిమితమై పోయినప్పుడు సహృదయత, సంస్కారం, మానవత, కష్ట సుఖాలూ మరచిపోతారు. మీ ఆధిక్యం కోసం వెలగాల్సిన, వెలుగుతున్న జ్ఞాన దీపికల్ని ఆర్పేస్తారు - అవునా?'' గర్జించాడు శాస్త్రి.

''నువ్వు నీతులు మాట్లాడేటంత గొప్ప వాడివై పోయావా శాస్త్రి?''

''పెద్దలన్నా పూజ్య భావంతో చిన్న వా న్నయి నేను నిజాన్ని నిర్భయంగా మాట్లాడుతున్నాను''

అది వాళ్ల కందరికీ వెటకారంగా, అవమానంగా తోచింది. ''మ నందరం నమ్ముకున్న పంచాంగం, జాతక శాస్త్రానికి మచ్చ తెచ్చాడు కనుక మనం రామాంజనేయ శాస్త్రిని వెలి వెయ్యడ మొక్కటే మార్గం!'' అన్నాడు నరసింహాచార్యులు.

''శుభం - నే నిప్పుడు అంతర్ముఖుణ్ణి - నాలో లోపాల్ని నేను తెలుసుకున్నాను. నా బ్రాహ్మణత్వం నాకు చిత్తశుద్ధీ, ఆత్మశుద్ధీ నేర్పింది. అందుకే ఈ పంచాంగ, జ్యోతిష వృత్తి నుంచి విముక్తు ణ్ణవ్వా లనుకుంటున్నాను. ఎందుకంటే నిజ జీవితానికీ, పంచాంగ జాతకాలకీ సంబంధం లేదనీ, అది కొందరిలో మనం సృష్టించిన భ్రమా భ్రాంతేననీ అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాడు ఈ పంచాంగ పరబ్రహ్మ బ్రహ్మజ్ఞ రామాంజనేయశాస్త్రి. డిగ్రీ చదువుకుని అభ్యుదయ భావాలు గల నా కూతురికి వరుడుగా, తానై వచ్చి పైసా కట్నం లేకుండా ప్రయోజకుడైన ఆ అబ్బాయి నా కూతుర్ని పెళ్లాడి అమెరికా తీసుకు వెళ్లాడు. నేను నా కూతుర్నీ, అల్లుణ్ణీ అమెరికాకు సాగనంపి ఇదే రావడం. కులానికీ, సంస్కారానికీ చాలా దూరం - గొప్ప కులంలో కుసంస్కారు లెందరు లేరు? అందుకే నా అల్లుడు అస్పృశ్యుల్లో గల సంస్కారవంతుడు. అందుకే అతని కాళ్లు కడిగి కన్యాదానం చెయ్యగలిగే విశ్వాసం నాలో కలిగింది. నే నింత కాలం నడుస్తున్న పాత తోవకి ఓ కొత్త గమ్యం దొరికింది!'' అంటూ ముందుకి నడిచాడు రామాంజనేయ శాస్త్రి బ్రహ్మ తేజస్సుతో.

★